క్లుప్తంగా

రహదారుల పరిశీలన



జి.కొండూరు: వరద ప్రవాహానికి ధ్వంసమైన రహదారులు, గండ్లు పడిన ప్రదేశాలలో వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా రాకపోకలను పునరుద్ధరించాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. కోడూరు, చిన్న నందిగామ గ్రామాలలో వరద ఉధృతికి ధ్వంసమైన రహదారులు, వరి, పత్తి పైర్లను బుధవారం ఆమె పరిశీలించారు. రహదారుల మరమ్మతులు, నష్ట గణన త్వరితగతిన చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పసుపులేటి రమేష్ పాల్గొన్నారు.

డిక్షనరీల పంపిణీ



మైలవరం: మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్ట్ అధ్యక్షుడు చనమోలు వరప్రసాద్ ఆర్థిక సౌజన్యంతో ఇంగ్లిష్–తెలుగు నిఘంటువును బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ, పాఠశాల కార్యదర్శి జె. రాధాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా ఆందోళన



నూజివీడు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని మాల యోధుల సంక్షేమ సంఘం నూజివీడు డివిజన్ నాయకులు చేబత్తిన మున్నా అన్నారు. మాల యోధుల సంక్షేమ సంఘం నూజివీడు శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఐక్యంగా ఉన్న దళితుల మధ్య చిచ్చు పెట్టే విధంగా తీర్పు ఉందన్నారు. వర్గీకరణ, క్రీమిలేయర్ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనను కొనసాగిస్తున్నామన్నారు. ఎస్సీలను విడదీసేలా ఉన్న తీర్పును వ్యతిరేకిస్తూ పోరాడేందుకే మాల యోధుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, నాయకులు కాలి సురేష్, పిళ్లా చరణ్, నత్తా నాగేశ్వరరావు, రాజ్‌కుమార్, కుంటం ఉదయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని జీవనం అలవర్చుకోవాలి

సాంత్వన ప్రాజెక్ట్ డైరెక్టర్ రామారావు



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ప్రతిఒక్కరూ ఒత్తిడిలేని జీవనం అలవర్చుకోవాలని సాంత్వన ప్రాజెక్ట్ డైరెక్టర్ రామారావు అన్నారు. కేతనకొండలోని నర్సింగ్ కళాశాలలో ఆత్మహత్యలకు వ్యతిరేకంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2021 సర్వే మేరకు భారతదేశంలో ప్రతి లక్ష మందికి 12 మంది చొప్పున ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రతి వ్యక్తి ఒత్తిడిని అధిగమించేందుకు యోగా, ధ్యానం, వ్యాయామం వంటివి జీవన విధానంలో అలవర్చుకోవాలన్నారు. ఎవరైనా భరించరాని ఒత్తిడికి గురవుతుంటే టోల్‌ఫ్రీ 14414 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య చెప్పుకుని ఉపశమనం పొందొచ్చన్నారు. క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. ఆత్మహత్యలు వద్దు.. ప్రాణం ముద్దు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఉషా, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ

తిరువూరు: భారీవర్షాలకు అంటువ్యాధులు ప్రబలకుండా తిరువూరులోని పేద కుటుంబాలకు బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హోమియో మందులు పంపిణీ చేశారు. హోమియో వైద్యురాలు అనుమోలు పుష్పకుమారి పర్యవేక్షణలో లయన్స్ క్లబ్ సభ్యులు ఇంటింటికీ తిరిగి మందులను అందజేశారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి నాగుబండి శ్యామ్‌సుందర్, సభ్యులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ఎ.కొండూరు: కోడూరు గ్రామంలో ఓటువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం ఎస్‌ఐ సీహెచ్ కృష్ణ పట్టుకున్నారు. కోడూరు ఓటువాగు నుంచి ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకుని ఎ.కొండూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

పది రోజులుగా రోడ్డుపైనే

- ముంపు బాధితులను వీడని కష్టాలు
- సహాయ శిబిరాల్లో బాధితులు
- హైవేపై గాజులపేట ప్రజలు



ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్‌లో ఉంటున్న వరద బాధితులు



గాజులపేట నీటి ముంపు నుంచి తేరుకోక పోవడంతో హైవేపై ఉంటున్న బాధితులు

ఇబ్రహీంపట్నం: కృష్ణానదికి పోటెత్తిన వరద ప్రవాహంతో సహాయక శిబిరాలకు చేరిన బాధితులు వరద కష్టాల నుంచి బయటపడే పరిస్థితి కనిపించడం లేదు. వరద తగ్గుముఖం పట్టి వారంరోజులు గడుస్తున్నప్పటికీ కొందరు సహాయక శిబిరాల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఆయా గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో ఇంకా నీరు ఉండటం, వీధులు, నివాస ప్రాంతాల్లో చెమ్మతో ప్రజలు నివశించే వీలు లేకపోవడంతో శిబిరాల్లోనే అష్టకష్టాలు పడుతున్నారు.

2న సహాయ శిబిరాలకు..

జూపూడి, భీమేశ్వర కాలనీ, ఇబ్రహీంపట్నం ఫెర్రీ, పెదలంక, చినలంక, మూలపాడు, కిలేశపురం, కొటికలపూడి, చిలుకూరు, దాములూరు గ్రామాల ప్రజలను ఈనెల 2న అధికారులు సహాయ శిబిరాలకు తరలించారు. కొన్ని గ్రామాల ప్రజలు ఇళ్లకు చేరినప్పటికీ లోతట్టు గ్రామాలైన ఫెర్రీ, ఇసుకరేవు, చినలంక, పెదలంక గ్రామాల ప్రజలు కొంతమంది ఇప్పటికీ ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ వద్ద ఉంటున్నారు.

శిబిరాల్లో అరకొర సదుపాయాలు

అరకొర సదుపాయాల మధ్య సమయానికి ఆహారం, తాగునీరు అందినా, అందక పోయినా పిల్లలతో అక్కడే ఉంటున్నారు. ముళ్ల కంచెల మధ్య చిన్న పిల్లలతో ఉండలేక పోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లంక గ్రామాల ప్రజల అవస్థలు అంతాఇంతా కాదు. శిబిరం వద్ద పాడి పశువులకు కాపలా ఉండటం, లంకలో వ్యవసాయ పొలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు చూసుకోవడం, ఇళ్లు, సామగ్రి శుభ్రం చేసుకోవడం కోసం నిత్యం వెళ్లిరావల్సి వస్తోంది. పంటలు నష్టపోయి, పనులు లేక, చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితుల్లో ఫెర్రీ నుంచి పెదలంకకు వెళ్లిరావాలంటే పడవకు ఒక్కొక్కరు రూ.1,000 చొప్పున చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం ద్వారా పడవ ఏర్పాటు చేయాలని కోరినా ప్రయోజనం లేదని వాపోతున్నారు.

హైవేపైనే గాజులపేట బాధితులు

ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న గాజులపేట పది రోజుల కిందట వరద ప్రవాహంలో పూర్తిగా ముంపునకు గురైంది. పక్కనే ఉన్న హైవేపై అప్పటి నుంచి బాధితులు కాలం వెళ్లదీస్తున్నారు. మెరక ప్రాంతంలో రోడ్లు, ఇళ్లల్లో నీటి ముంపు తగ్గినప్పటికీ లోతట్టులో ఇళ్లు, రోడ్లు నీటిలోనే ఉన్నాయి. దీంతో రేయింబవళ్లు రోడ్డుపై పట్టాలు వేసుకుని పిల్లలతో కలిసి కాలం వెల్లదీస్తున్నారు. విజయవాడ–హైదరాబాద్ హైవేపై అతివేగంతో వెళ్లే వాహనాలతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అనే ఆందోళన వారిలో నెలకొంది. రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

లంక గ్రామాలకు తీవ్ర నష్టం



ఈ ఏడాది వచ్చిన రెండు వరదలతో లంక గ్రామాలు తీవ్రంగా నష్టపోయాయి. పంటలు, పశువులు, ఇళ్లల్లో సామగ్రి కోల్పోయాం. వరద ముంపుతో కట్టుబట్టలతో సహాయక శిబిరాలకు చేరాం. ఇక్కడ సరైన సదుపాయాలు లేవు. ముళ్ల కంచెల మధ్య జీవనం సాగిస్తున్నాం. అధికారులు త్వరగా ఇళ్లకు పంపాలి.

– డి.అంబేడ్కర్, పెదలంక గ్రామం

లంకకు వెళ్లాలంటే వెయ్యి అవుతుంది



ట్రక్ టెర్మినల్ శిబిరంలో ఉన్న మేము పెదలంక గ్రామంలోని ఇళ్లు, పంట పొలాలు చూసుకునేందుకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. ఫెర్రీ నుంచి పడవల వారు రానుపోను రూ.1000 వసూలు చేస్తున్నారు. ఇళ్ల వద్ద చేరిన చెమ్మతో ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి ఉంది. ఇళ్లకు వెళ్లలేక, శిబిరాల్లో ఉండలేక ఇబ్బందులు పడుతున్నాం.

– సీహెచ్ చంటి, పెదలంక గ్రామం

మృతురాలు పద్మ కుటుంబానికి పరామర్శ



రామచంద్రాపురం(విస్సన్నపేట): కలగర పంచాయతీ రామచంద్రాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రాజబోయిన వెంకటేశ్వర్లు సతీమణి పద్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు బుధవారం పరామర్శించారు. మృతురాలి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నిత్యావసరాల పంపిణీలో అప్రమత్తంగా ఉండాలి

సీఐ దాడి చంద్రశేఖర్

మైలవరం: వరద బాధితులకు గ్రామాలలో ప్రభుత్వం అందించే రేషన్, నిత్యావసర సరుకులు పంపిణీ సమయంలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఐ దాడి చంద్రశేఖర్ అన్నారు. మైలవరం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పోలీస్ సిబ్బందికి సీఐ చంద్రశేఖర్ బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మైలవరం సర్కిల్ పరిధిలో 30 మంది పోలీస్ సిబ్బందిని మూడు టీమ్‌లుగా ఏర్పాటు చేశామన్నారు. మైలవరం, జీ.కొండూరు, రెడ్డిగూడెం మండలాల్లో రేషన్ పంపిణీ రెండు రోజులు జరుగుతుందని, ఈ సమయంలో తోపులాట, ఇతరత్రా ఘటనలు జరుగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఎస్ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులు ఛిద్రం



చంద్రాల వద్ద కోతకు గురైన రహదారి



కోతకు గురైన గానుగపాడు-టేకులపల్లి రోడ్డు

తిరువూరు/మైలవరం: ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలకు తిరువూరు, మైలవరం మండలంలోని పలు ఆర్ అండ్ బీ రహదారులు ఛిద్రమయ్యాయి. తారురోడ్లు గోతులమయంగా మారాయి. తిరువూరు–తునికిపాడు, శ్రీరాంపురం–పేరువంచ, శ్రీనికేతన్–కొత్తపల్లి, అక్కపాలెం–తిరువూరు, ఎంఎన్‌కే రోడ్డు నుంచి గానుగపాడు వెళ్లే రహదారి, పాయపూరు–పెద్దవరం, తిరువూరు–అడసర్లపాడు తదితర రహదారులు వరద కోతకు గురయ్యాయి. టేకులపల్లి–గానుగపాడు రోడ్డులో పలు చోట్ల కల్వర్టులు, అప్రోచ్‌రోడ్లు కొట్టుకుపోయాయి. తిరువూరు–అక్కపాలెం రోడ్డు కోతకు గురైంది. రోలుపడి వద్ద, తిరువూరు మధిర రోడ్డులో రహదారి పలు చోట్ల ఛిద్రమైంది. మైలవరం–నూజివీడు ఆర్ అండ్ బీ రహదారి మైలవరం మండలం చంద్రాల వద్ద సుమారు 80 మీటర్ల వరకు ధ్వంసమైంది. రోడ్డుకు ఇరు వైపులా మట్టి కోతకు గురై పెద్ద గండ్లు ఏర్పడ్డాయి. రాకపోకలకు అంతరాయమేర్పడి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



వరద నీటితో దెబ్బతిన్న అక్కపాలెం రహదారి

మరమ్మతులకు ప్రతిపాదనలు

తిరువూరు మండలంలో దెబ్బతిన్న ఆర్ అండ్ బీ రహదారుల అత్యవసర మరమ్మతులకు అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు. రాకపోకలకు వీలులేని రీతిలో ఉన్న రహదారుల మరమ్మతుకు సుమారు రూ.కోటికి పైగా నిధులు అవసరమవుతాయని భావిస్తున్నారు. ప్రతిపాదనలు ప్రభుత్వామోదానికి పంపుతున్నట్లు తిరువూరు ఆర్ అండ్ బీ జేఈ గాయత్రి తెలిపారు.



వరదలకు గోతులమయమైన తిరువూరు-మధిర ఆర్ అండ్ బీ రహదారి

బాధితులకు బాసటగా ..

ఇబ్రహీంపట్నం: పశ్చిమ ఇబ్రహీంపట్నం, గాజులపేట, జూపూడి గ్రామాల వరద బాధితులకు శిరీషా వెంకటాద్రి నేతృత్వంలో బియ్యం, నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. స్థానిక ఐశ్వర్య గ్రాండ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న పలువురు మహిళలు పాల్గొన్నారు.

- సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఫెర్రీ, కొండపల్లి శాంతినగర్ వరద బాధితులకు బుధవారం అన్నదానం చేశారు. సీఐటీయూ నాయకులు ఆలేటి విఠల్‌రావు, మండల కార్యదర్శి ఎం.మహేష్, ఐద్వా నాయకురాలు రామసీత, కామేశ్వరరావు, పాల్గొన్నారు.
- నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ సింగ్‌నగర్ వాంబే కాలనీ వరద బాధితులకు బుధవారం దుస్తులను పంపిణీ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ పిలుపుతో ట్రిపుల్ ఐటీలోని విద్యార్థులు, ఫ్యాకల్టీలు తమ వంతు సాయంగా దుస్తులు వితరణగా అందజేశారు. 175 వరద బాధిత కుటుంబాలకు మొత్తం 1,647 జతల బట్టలను అందజేశారు.
- విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామ పంచాయతీలో 19, కలగర గ్రామ పంచాయతీలో నాలుగు, కొండపర్వ గ్రామంలో ఒక కుటుంబానికి నిత్యావసరాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ, సర్పంచ్ కారుమంచి స్వాతి పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న అపార్ట్‌మెంట్ మహిళలు



పుట్రేలలో నిత్యావసరాలు అందజేస్తున్న అధికారులు, సర్పంచ్

కుళ్లిన పంట.. మేటలు వేసిన పొలాలు



వెల్లటూరు పడమర చెరువు కింద కుళ్లిపోయిన వరి పైరు

జి.కొండూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, బుడమేరు వరద ప్రవాహానికి తోడు వెల్లటూరు పడమర చెరువుకు గండిపడడంతో చెరువు కింద ఆయకట్టుగా ఉన్న 1200 ఎకరాలలో వరిపైరు తడిచిపెట్టుకుపోయింది. ఇదే చెరువుకు సమీపంలో బుడమేరుకు కూడా గండి పడటంతో వరద ఉధృతికి వచ్చిన మట్టి, ఇసుక వరి పొలాల్లో మేటలు వేసింది. వారం రోజులకు పైగా వరదనీటిలో పైరు ఉండడంతో పూర్తిగా కుళ్లిపోయింది. పెట్టిన పెట్టుబడిపోయి, మరో పంట వేసేందుకు అవకాశం లేక ఆందోళనలో ఉన్న రైతులకు మేటలు తొలగించడం ఆర్థికంగా అదనపు భారం కానుంది. ప్రభుత్వం నష్టపరిహారం అందించడంతో పాటు మేటలు తొలగించేందుకు అదనంగా ఆర్థిక సాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు



బీమవరప్పాడు గ్రామంలో వినాయకుడి ఊరేగింపు



తిరువూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పూజలు



తిరువూరు యూనియన్ బ్యాంకు వద్ద పూజలు



తిరువూరు జైబావి సెంటర్లో నవరాత్రి పూజలు

తిరువూరు/జి.కొండూరు: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఐదో రోజు బుధవారం పలు కూడళ్లలో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరువూరు భూమా వారి వీధి నవరాత్రి ఉత్సవ పందిరిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. జి.కొండూరు మండల పరిధి వెల్లటూరు శివారు బీమవరప్పాడు గ్రామంలో వినాయకుడి ఊరేగింపు కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ పాల్గొని పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



తిరువూరు భూమా వారి వీధిలో పూజల్లో పాల్గొన్న మహిళలు

15న గణపతికి శాంతి కల్యాణం

మైలవరం: నూజివీడు రోడ్డులోని లక్ష్మీ గణపతి స్వామి వారి దేవస్థానంలో లక్ష్మీ గణపతి నవరాత్రులు సందర్భంగా ఈ నెల 15న ఉదయం 10 గంటలకు స్వామివారికి శాంతి కల్యాణం, 12 గంటలకు మహా అన్న ప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు కాజా మహేష్ తెలిపారు. ప్రతి రోజూ రాత్రి 7.15 గంటలకు స్వామి వారికి నక్షత్ర హారతి జరుగుతుందని చెప్పారు.

రేపు మండల స్థాయి క్రీడా పోటీలు

నూజివీడు: మండల స్థాయి బాలుర క్రీడా పోటీలు ఈ నెల 13న ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో జరుగుతాయని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ హెచ్‌ఎం బి.హేమలత తెలిపారు. ఎస్ఆర్ఆర్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నూజివీడు మండల, నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను నిర్వహించనున్న నేపథ్యంలో నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాలకు చెందిన వ్యాయామోపాధ్యాయుల సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలను చర్చించారు. అనంతరం క్రీడా కోర్టులను ఏర్పాటు చేశారు. క్రీడా పోటీల నియోజకవర్గ ఇన్‌చార్జి స్వప్న, వ్యాయామోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, లక్ష్మి, వనజ, ఆరతి, రాజేశ్వరి, రాణి, సరళ, నాగేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

వరద నీరు నిల్వ ఉండకుండా చర్యలు

మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



వరద ప్రభావిత ప్రాంతంలో పరిస్థితిని తెలుసుకుంటున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వరద నీరు నిల్వ ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, రోడ్ల వెంబడి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సంబంధిత అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. బుధవారం ఉదయం వరద ప్రభావిత ప్రాంతాలైన నందమూరి నగర్, వాంబే కాలనీ, కండ్రిక సెంటర్, సీవీఆర్ ఫ్లై ఓవర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. నందమూరి నగర్‌లో భూగర్భ డ్రెయినేజీ, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి కుళాయిల్లో వస్తున్న నీటిని వాడుక అవసరాలకు మాత్రమే వినియోగించాలని సూచించారు. తాగు నీటిని ప్రత్యేకంగా ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నామని చెప్పారు. రోడ్లపై నీటి నిల్వలను వెంటనే తొలగించాలని, ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు తరచూ బ్లీచింగ్ చల్లాలని అధికారులను ఆదేశించారు. వరదలో కొట్టుకొచ్చిన వ్యర్థాలను తొలగించడానికి 465 వాహనాలను వినియోగిస్తున్నామని చెప్పారు. 184 ట్రాక్టర్లు, 122 టిప్పర్లు, 65 జేసీబీలు, 13 డోజర్లు, ఏడు పొక్లెయిన్లు, రెండు క్రేన్లు, 25 కాంపెక్టర్లు, 23 ఎయిర్‌టెక్ మెషిన్లతో వరద ప్రభావిత ప్రాంతాలను శుభ్రం చేస్తున్నామని వివరించారు.

ప్రజాప్రతినిధుల పబ్లిసిటీ పిచ్చితో ట్రాఫిక్ జామ్



ఊర్మిళానగర్ రోడ్డులో ప్రజాప్రతినిధుల హడావుడితో స్తంభించిన ట్రాఫిక్

భవానీపురం(విజయవాడపశ్చిమ): 'యథా సీఎం.. తథా ప్రజాప్రతినిధులు' అన్న చందాన తెలుగు దేశం పార్టీ ప్రజాప్రతినిధుల పబ్లిసిటీ పిచ్చి పరాకాష్టకు చేరింది. వరద బాధితులకు సాయం పేరుతో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తన అనుచర గణంతో స్థానిక ఊర్మిళానగర్ మెయిన్ రోడ్డులో బుధవారం చేసిన హడావుడితో ట్రాఫిక్ జామైంది. రోడ్డుపై ఒక పక్క సరుకులకు సంబంధించిన లారీ, మరో వైపు ఎంపీ చిన్ని, ఇతర చోటామోటా నాయకుల కార్లతో రహదారి మొత్తం నిండిపోయింది. కనీసం ద్విచక్ర వాహనం కూడా ముందుకు వెళ్లలేని పరిస్థితిలో వెనుక ఉన్న వాహనాలన్నీ ఒక్కసారిగా హారన్లు మోగించడంతో గందరగోళం నెలకొంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిద్దామని స్థానికులు ప్రయత్నించినా అక్కడ ఎవరూ వినే పరిస్థితి లేదు. ప్రజాప్రతినిధుల కంట పడాలన్న తాపత్రయంతో టీడీపీ శ్రేణులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ప్రజాప్రతినిధులుగానీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కానీ దారిన వచ్చిపోయే సామాన్యుల అవస్థలను పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో నీరసం వచ్చి అలాగే ఉండిపోయారు.

ఘనంగా గ్లోబల్ హ్యూమన్ రైట్స్ వార్షికోత్సవం



ఆగిరిపల్లి: గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్నెస్ అసోసియేషన్ నాలుగో వార్షికోత్సవం ఆగిరిపల్లిలో జిల్లా చైర్మన్ నంజం రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హ్యూమన్ రైట్స్ జాతీయ కార్యదర్శి ప్రత్తిపాటి సురేష్ పాల్గొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బిస్కెట్లు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు నజ్మ, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ సంస్థ కోస్తాంధ్ర రీజనల్ లీగల్ అడ్వైజర్ రాణి మేకల సత్యనారాయణ, రీజనల్ మీడియా చైర్మన్ ఎస్ఎస్ బాబు, జిల్లా కార్యదర్శి పల్లగాని వెంకట కోటేశ్వరరావు, జిల్లా ఎంప్లాయీస్ వింగ్ చైర్మన్ తాడిశెట్టి నారాయణ, జిల్లా సలహాదారుడు సతీష్ పాల్గొన్నారు.

కోడూరులో పారిశుద్ధ్య పనులు

ఎ.కొండూరు: మండలంలోని కోడూరు గ్రామంలో బుధవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. వీధుల్లో చెత్తచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లారు. సర్పంచ్ తేళ్లూరి సురేష్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు దోమలు వృద్ధి చెందకుండా గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నామన్నారు.